క్లుప్తంగా

బ్యానర్‌ను తొలగించరా?



అడ్డాడ(పామర్రు): ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలోని పామర్రు–గుడివాడ జాతీయ రహదారికి పక్కన కూటమి ప్రభుత్వ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్ అధికారులకు కనబడుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్యానర్‌ను తొలగించి ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బాబా విగ్రహ ప్రతిష్ట



మండవల్లి: షిరిడీ సాయిబాబా సంకీర్తన మందిరంలో సోమవారం ఉదయం గణపతిపూజ, యంత్రస్థాపన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాలకోడేటి లక్ష్మీనరసింహమూర్తి దివ్య సంకల్పంతో కార్యనిర్వాహకుడు గుడిపాటి శ్రీరామఫణికుమార్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ట



కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరులోని ఆంజనేయస్వామి ఆలయ శిఖరప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం హనుమత్ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న పరివార సమేత శ్రీరామ చంద్రమూర్తికి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్యశిబిరం




పమిడిముక్కల: వేల్పూరు పంచాయితీ కార్యాలయంలో సిద్ధార్థ దంత వైద్య కళాశాల(చిన్నవుటపల్లి) ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దంత వైద్యులు యశ్వంత్, శ్రీదేవి, రాజేశ్వరి, సాయిప్రసన్న, వాసవి రోగులను పరీక్షించారు. 60 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి



తోట్లవల్లూరు: ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి కోరారు. ఈ విషయమై స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో ఆమె వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తోట్లవల్లూరు పుష్కరఘాట్ వద్ద జల్లుస్నానాలు, పిండ ప్రదానాలు, తాగునీటి వసతి, మహిళలు దుస్తులు మార్చుకునే వసతి కల్పించాలని పేర్కొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్త శివలెంక గౌరీశంకర్, ఎస్ఐ అవినాశ్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

బీసీ సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు



గుడివాడ టౌన్: బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుడివాడకు చెందిన రావులకొల్లు వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వి. బేబీరాణి నియామకపత్రాన్ని అందజేశారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

గ్రామ స్థాయి 'స్పందన'కు మంగళం

> గ్రామ స్థాయి సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో సమస్యలు తిష్ట వేశాయి. మండల స్థాయిలో మొక్కుబడిగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. పల్లె ప్రజలు తమ గోడును చెప్పుకునేందుకు మండల కేంద్రానికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు.



అంగలూరు గ్రామ సచివాలయం

గుడివాడరూరల్/గుడ్లవల్లేరు: గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే ఉద్దేశంతో రోజూ 'స్పందన' కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఒక గంట సమయం అవకాశం ఉండేది. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందన కార్యక్రమానికి హాజరయ్యేవారు. గ్రామంలో ఏ విధమైన సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించుకునేవారు. దీనివలన ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండానే సమస్యలు పరిష్కారమయ్యేవి.

పేరుకుపోతున్న సమస్యలు

గ్రామాల్లో సమస్యలను అధికారులకు విన్నవించేందుకు ప్రజలు మండల కేంద్రాలకు రావాల్సి ఉండటంతో చాలా మంది బాధితులు, ప్రజలు వెళ్లలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రాల్లో స్పందన కార్యక్రమాన్ని వారానికి ఒకసారి నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా గ్రామ స్థాయిలోనే గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందని చెబుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు



మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వారి కష్టాలు చెప్పుకునేందుకు గత ప్రభుత్వం అద్భుతంగా గ్రామాల్లోనే స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తిస్థాయిలో కొనసాగించాలి.

– కె.పవన్, చిరిచింతల

మండల కేంద్రానికి వచ్చేందుకు ఇబ్బంది



మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి రావాలంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు రాలేక అవస్థలు పడుతున్నారు. వారి కష్టాలను చెప్పుకునేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్భుతంగా గ్రామాల్లోనే స్పందన ఏర్పాటు చేసింది. అదేవిధంగా ఏర్పాటు చేయాలి.

– చందన నాగంనాయుడు,
వైఎస్సార్ సీపీ నేత, వెణుతురుమిల్లి, గుడ్లవల్లేరు మండలం

పునరుద్ధరించాలి



గ్రామాల్లో సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే గ్రామ స్థాయిలో స్పందన(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేసుకునేందుకు మండల కేంద్రాలకు వెళ్లడానికి వ్యయ, ప్రయాసలు తప్పడం లేదు.

– చింతాడ నాగూర్, ఎల్ఎన్ పురం గ్రామం

గతంలో మాదిరిగా స్పందన ఉండాలి



గ్రామాల్లో సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని గత వైఎస్సార్ సీపీ హయాంలో మాదిరిగా ఏర్పాటు చేయాలి. మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల నుంచి సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లాలంటే వ్యయ, ప్రయాసలు ప్రజలు భరించలేకపోతున్నారు.

– ముక్కు సోమేశ్వరరావు,
ఎంపీటీసీ, శేరీ దగ్గుమిల్లి, గుడ్లవల్లేరు మండలం

సమాజంలో శాంతి స్థాపనకు కృషి


పేదలకు దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అప్పుడే సమాజం శాంతిమయంగా మారుతుందన్నారు. రెవరెండ్ జాన్‌వెల్లీ మాట్లాడుతూ లైఫ్ సెంటర్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి పేదలను ఆదుకోవాలన్నారు. అనంతరం పేదలకు దుస్తులను అందజేశారు. తొలుత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో విజన్ లైఫ్ సెంటర్ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, పామర్రు టౌన్ పాస్టర్ల ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ముదినేపల్లి రూరల్: తన సోదరితో సన్నిహితంగా ఉంటున్నాడని మందలించిన యువకుడిపై దాడి చేసిన ఘటన మండలంలోని పెయ్యేరులో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన బి.శంకర్ సింగరాయపాలెంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. తన సోదరి భర్తతో విడిపోయి శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో ముదినేపల్లికి చెందిన వి.రాజా అనే వ్యక్తి కొంతకాలంగా ఆమెతో సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ విషయం తెలిసిన శంకర్ ఇటీవల రాజాను మందలించాడు. ఈ క్రమంలో ఆదివారం ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో రాజా కర్రతో శంకర్‌పై దాడి చేసి గాయపర్చాడు. అడ్డుకున్న శంకర్ మేనల్లుడిపై కూడా దాడి చేయడంతో అతడు గాయపడ్డాడు. వీరిని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23 నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు


పెదకళ్లేపల్లిలో ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామిఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వాల్‌పోస్టర్లు, ఉత్సవాల బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీసీ మాట్లాడుతూ మహాశివరాత్రికి ఇక్కడ ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకుంటే పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుని అలంకరిస్తారని చెప్పారు. 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రాత్రి 7 గంటలకు జగజ్యోతి, రాత్రి ఒంటి గంటకు ఎదురుకోలు ఉత్సవం, తెల్లవారుజాము రెండు గంటలకు శ్రీస్వామివారి దివ్యకళ్యాణోత్సవం నిర్వహించి, ఐదు గంటలకు గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

ముగిసిన అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు


పూర్ణాహుతి చేస్తున్న దంపతులు

బంటుమిల్లి: పెదతుమ్మిడి గ్రామంలోని శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు పండితుడు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న రుద్రహోమానికి పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా పలువురు దంపతులకు, భక్తులకు త్రిశూలస్నానం చేయించారు. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ మట్టా విజయలక్ష్మి, అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా నాగబాబు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ లక్కాప్రగడ మాధవరావు, కోశాధికారి జల్లూరి శరభయ్యగుప్త పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం

అవనిగడ్డ: స్థానిక వంతెన సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి అవనిగడ్డకు చెందిన సింహాద్రి భవన్నారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు రూ.70 వేలు విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భవన్నారాయణ దంపతులు, ఆయన కుమారుడు సాహితీచంద్ర ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. తొలుత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీకి కిరీటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బడే దానారావు, గంగు దేవరాజు, వడ్డి రవీంద్రతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనుల కారణంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దకాల్వ సెంటర్ నుంచి బ్యాంక్ కాలనీ వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు జలజీవన్ మిషన్ పథకంపై సమావేశం

మండవల్లి: జలజీవన్ మిషన్ పథకంపై మండవల్లి గ్రామ సచివాలయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణలో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ టి.అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. కుళాయిలు లేని వారు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆక్వా సాగుకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయాలి

కైకలూరు: ప్రభుత్వం ఆక్వా రైతులందరికీ సబ్సిడీపై విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలిదిండి ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం రైతుల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపలు, రొయ్యలకు కనీస ధరలు ప్రకటించి, అమలు చేయాలన్నారు. ఫీడ్, సీడ్ ధరలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చి పెట్టుబడి ఖర్చులు తగ్గేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల ఇరిగేషన్ సమీక్ష సమావేశంలో పంట కాలువలు నిర్వహణను ప్రైవేట్‌కు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువలు ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళీరావు పాల్గొన్నారు.

ఇసుక క్వారీల్లో యంత్రాలతో లోడింగ్ వద్దు

తోట్లవల్లూరు: ఇసుక క్వారీల్లో యంత్రాలతో లోడింగ్ జరపాలనే ఆలోచన సరికాదని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విషయమై ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కుసుమకుమారి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మకు సోమవారం వినతిపత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

10కే రన్‌లో త్రివేణి విద్యార్థి ప్రతిభ


గౌతమ్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పర్వతనేని జగన్మోహన్ రావు మెమోరియల్ 10కే రన్‌లో తమ విద్యార్థి ప్రతిభను ప్రదర్శించి నగదు బహుమతి పొందారని త్రివేణి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎస్.శివశంకర్ తెలిపారు. సోమవారం పాఠశాల కార్యాలయంలో బహుమతి సాధించిన విద్యార్థి కె.గౌతమ్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ తమ విద్యార్థి గౌతమ్ 10కే రన్‌లో పాల్గొని ఉత్తమ క్రీడాకారుడు (కన్సొలేషన్) బహుమతి సాధించారని తెలిపారు.

అధైర్య పడొద్దు.. అందరికీ అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కైలే అనిల్‌కుమార్


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు: ఎవ్వరూ అధైర్య పడొద్దు.. అందరికీ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులతో సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు వారి సమస్యలను అనిల్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కైలే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు హామీలను మభ్య పెట్టేందుకు కూటమి నాయకులు మాయమాటలు చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేస్తోందో ప్రజలకు వివరించి చెప్పాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, అరాచకాలు చేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తరఫున ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, మొవ్వ మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఆరేపల్లి శ్రీహరి, పంచకర్ల సందీప్, సింహాచలం, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


గుడివాడలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


పామర్రు సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా


మొవ్వ సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు


కైకలూరులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గుడివాడరూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు యెండూరి గీత, టి.వాణి కోరారు. స్థానిక శిశు సంక్షేమ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలకు వేతనాలు, గ్రాడ్యుటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాలని తదితర డిమాండ్లతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో అంగన్‌వాడీ వర్కర్లకు ఎలాంటి జీతభత్యాలు పెంచలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్సీపీ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మాజీ, రమాదేవి, నిర్మలజ్యోతి, మేరీ కుమారి, సుగుణ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి త్రివేణి పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక సీడీపీఓ కార్యాలయంవద్ద అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నాను సోమవారం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు గంగాధరప్రసాద్, విల్సన్, నాగభూషణం ధర్నా శిబిరాన్ని సందర్శించి అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.ఉమారాణి, కార్యదర్శి ఎం.సువర్ణలత, చిన్నారి, చిన్ని, అరుణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలో సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎస్.విజయలక్ష్మి, డి.రాజారత్నం, చల్లపల్లి గంగా భవాని, వేమూరి లక్ష్మి, తాత శివకుమారి, అమలేశ్వరమ్మ, పద్మజ, సునీత, భలే పద్మ, నాగమల్లేశ్వరి, సత్యవాణి, శేషుకుమారి, కృష్ణకుమారి, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, కమల, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు పెరిగిన ధరల ప్రకారం నెల జీతం రూ.26,000 అందించాలని, మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లగా మార్పు చేయాలనే ప్రధాన డిమాండ్లతో అంగన్‌వాడీ కార్యకర్తలు కైకలూరు సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. అనంతరం సీడీపీఓ దీప్తికి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షురాలు పొలవరపు సుజాత, కైకలూరు ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి ఎల్.మీనాకుమారి, సెక్టార్ల లీడర్లు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. నీట మునిగిన మినుము పంట


నీట మునిగిన మినుము పంట

నందివాడ: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నందివాడ మండలం జొన్నపాడులో మినుము పంట నీట మునిగింది. రైతులకు సమాచారం ఇవ్వకుండా మండలంలోని దోసపాడు చానల్ గేట్లు ఎత్తడంతో జొన్నపాడు గ్రామానికి చెందిన బెతాల అనిల్‌బాబు సాగు చేసిన రెండు ఎకరాల మినుము పంట నీట మునిగింది. చేపల చెరువుల యజమానులు ఇచ్చే నగదు కోసం అధికారులు చేసిన తప్పిదంతో తాను నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకుని, నష్టపోయిన తనకు పరిహారం అందించాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

నేడు సమన్వయ కమిటీ సమావేశం

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర (తీర్థం) నిర్వహణ కోసం మంగళవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద రెండో విడత అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు సోమవారం తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 13 వరకు జాతర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉత్సవ చైర్మన్, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరవుతారని ఈఓ తెలిపారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(సీనియర్ డివిజన్)
గుడివాడ
H.M.O.P. No. 38/2024

బిట్వీన్
తమ్మ శ్రీకాంత్ రెడ్డి S/o. జగన్నాథరెడ్డి, హిందువు, వయస్సు : 40 సం॥లు, చింతల్, కుతుబుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా. ..... పిటీషనర్

తమ్మ విజయశ్రీ @ ఓగ్గు విజయశ్రీ W/o. శ్రీకాంత్‌రెడ్డి, D/o. సుధా ప్రభాకరరెడ్డి, హిందువు, వయస్సు : 38 సం॥లు, గృహిణి డోర్ నెం. 32-64-1, గుడివాడ రోడ్డు, బాపూజి పేట, పామర్రు, కృష్ణాజిల్లా. సెల్: 98499 45451.

పై నెంబరు పిటీషనర్ H.M.O.P. 38/2024 లో శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం రెస్పాండెంటుకు నోటీసు పేపరు ప్రకటన ద్వారా సర్వు చేయుటకు H.M.O.P. 38/2024 ని ది. 07-03-2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన రెస్పాండెంటు స్వయంగా గాని వారి అడ్వకేట్ గారి ద్వారాగాని ఉదయం 10:30 గం॥కు పై కోర్టులో హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు పిటీషన్ రెస్పాండెంటు పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి. రామకృష్ణారెడ్డి, L.L.B.
అడ్వకేట్, గుడివాడ
ఫోన్ : 9490881180